

ప్రధాన ప్లాట్ ఫాంపై గూడ్స్ బండి ఉండగా మధ్య లైన్‌లో వస్తున్న రైలు కోసం కంకరపై నిలబడి ఎదురు చూస్తున్న ప్రయాణికులు



ప్లాట్ ఫాం లేకపోవడంతో రైలు ఎక్కడానికి ఇబ్బందులు పడుతున్న మహిళలు

రైలు ఎక్కేదెలా..?

- కౌకుంట్ల స్టేషన్‌లో రెండు రోజులుగా ప్రయాణికులకు అవస్థలు

దేవరకద్ర: కౌకుంట్ల రైల్వే స్టేషన్‌లో గత రెండు రోజులుగా ప్రయాణికులు రైలు ఎక్కేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అక్కడ ఉన్న రైల్వే అధికారులు చూసి కూడా స్పందించడం లేదని ఆరోపిస్తున్నారు. ప్రయాణికుల కథనం ప్రకారం.. కౌకుంట్ల స్టేషన్‌లో కేవలం ఒక ప్లాట్ ఫాం మాత్రమే ఉంది. మరో రెండు లైన్లు క్రాసింగ్‌ల, కోసం లూప్‌లైన్‌గా వాడుకుంటున్నారు. మరో లైన్ స్టేషన్ సమీపంలో ఉన్న గోదాంకు అనుసంధానంగా ఉంది. ఈ క్రమంలో ప్రయాణికుల కోసం ఉన్న ఒక్క ప్లాట్ ఫాంపై రెండు రోజుల నుంచి గూడ్సు రైలును నిలిపారు. దీంతో రైళ్ల రాకపోకలు మధ్యలో ప్లాట్ ఫాం లేని లైన్లపై సాగిస్తున్నారు. క్రాసింగ్‌లు కూడా అవే లైన్లపై నిర్వహిస్తున్నారు. దీంతో శని, ఆదివారాల్లో ప్రయాణికులు గూడ్సు రైలుపై నుంచి కొందరు, దాటలేని వారు గూడ్సు కింద నుంచి మధ్య లైన్ వద్దకు చేరుకున్నారు. పట్టాల పక్కన కంకర రాళ్ల మీద నిలబడి రైలు కోసం ఎదురు చూశారు. మధ్య లైన్ వద్ద ఫ్లాట్ ఫాం లేకపోవడంతో రైలు వచ్చిన తరువాత వృద్ధులు, పిల్లలు, మహిళలు అందులోకి ఎక్కడానికి, దిగడానికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇక రైలు దిగిన వారు కూడ స్టేషన్‌లోకి వెళ్లడానికి అవస్థలు పడ్డారు. రెండు రోజులు గడిచినా అధికారులు స్పందించక పోవడంతో ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి కౌకుంట్ల స్టేషన్‌లో సౌకర్యాలు మెరుగు పరచాలని కోరుతున్నారు.

అధికారులకు ఫిర్యాదు చేశాం



ప్లాట్ ఫాంపై గూడ్సు ఆపి ప్రయాణికులకు ఇబ్బందులు కలిగించడంపై రైల్వే అధికారులకు ఫిర్యాదు చేశాం. చాలా సార్లు ఇదే సమస్య ఉత్పన్నం అవుతోంది. రైల్వే అధికారులు ప్రయాణికులకు ప్రాధాన్యత ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఇక్కడ మరో ప్లాట్ ఫాం ఏర్పాటు చేసి, ఫుట్ ఓవర్ బ్రిడ్జిని నిర్మించాల్సిన అవసరం ఉంది.

–కోట్ల శ్రీనివాస్‌రెడ్డి, కౌకుంట్ల

సౌకర్యాలు మెరుగు పరచాలి



కౌకుంట్ల స్టేషన్‌కు ఇదివరకు ఒక మహర్దశ ఉండేది. ఇక్కడ ఉద్యోగుల డ్యూటీలు మారే జంక్షన్ ఉండేది. అలాగే రైలు ఇంజన్‌లకు వాటర్ పోసే ట్యాంకు కూడా ఉండేది. ప్రతి రైలు కనీసం అరగంట ఆగేది. అలాంటిది..ప్రయాణికులకు ఇబ్బందులు కలిగే పరిస్థితి వచ్చింది. ఉన్న ఒక్క ప్లాట్ ఫాంపై గూడ్సు రైలు నిలిపితే ప్రయాణికులు ఎలా వెళతారు. వృద్ధులు, పిల్లలు, మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సౌకర్యాలు మెరుగుపరచాలి.

–కోడి సురేందర్, కౌకుంట్ల

వార్డుల్లో సమస్యలన్నీ పరిష్కరిస్తాం



పాత బ్రిడ్జి తొలగింపు పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: వార్డుల్లో సమస్యలన్నీ పరిష్కరిస్తామని మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్ గౌడ్ వివరించారు. కొన్ని రోజులుగా ఆయా వార్డుల్లో పర్యటిస్తున్న ఆయన కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఐదో వార్డు పరిధిలోని నగరకాలనీని సందర్శించారు. ఈ సందర్భంగా డ్రెయినేజీ వ్యవస్థ పూర్తిగా లేకపోవడంతో ఇళ్ల నుంచి వచ్చే మురుగు ఎక్కడబడితే అక్కడ గుంటలుగా పేరుకుపోతున్నాయని స్థానికులు ఫిర్యాదు చేశారు. చాలా వరకు మట్టిరోడ్లే ఉన్నాయని, తాగునీరు సరిగా సరఫరా కావడం లేదని వాపోయారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమస్యలను వీలైనంత వరకు పరిష్కరిస్తామని చైర్మన్ హామీ ఇచ్చారు. అనంతరం 40వ వార్డు పరిధిలోని హిందీపండిట్ కాలేజీ గల్లీలో ఏర్పాటుచేసిన పవర్ బోరును ప్రారంభించారు. అలాగే పాతపాలమూరు వద్ద రెండోవైపు కొత్త బ్రిడ్జి నిర్మాణం కోసం పాతదానిని తొలగించే పనులను పరిశీలించారు. త్వరితగతిన పూర్తిచేసి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులకు సూచించారు. కార్యక్రమాల్లో వైస్ చైర్మన్ షబ్బీర్ అహ్మద్, కౌన్సిలర్లు మసరత్ సుల్తానా, జాజిమొగ్గ నర్సింహులు, స్థానికులు ముజామిల్, వెంకట్రాములు, రామస్వామి, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

మహబూబ్‌నగర్ క్రీడలు: యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని, క్రీడల్లో పాల్గొనడం వల్ల దేహదారుఢ్యంతోపాటు మానసికంగా ఎదగవచ్చని మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియంలో ఆదివారం జిల్లాస్థాయి తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో మున్సిపల్ చైర్మన్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చాంపియన్‌షిప్ నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఇలాంటి క్రీడాపోటీలు విద్యార్థులు, యువతలో దాగివున్న క్రీడానైపుణ్యాలను వెలికితీస్తాయని అన్నారు. జిల్లా క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జి.సాయిలు, సురేందర్‌బాబు, కోశాధికారి ప్రవీణ్, సీనియర్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

పీయూలో తైక్వాండో పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న బాబులాల్ తదితరులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో ఆదివారం తైక్వాండో జిల్లా చాంపియన్‌షిప్ పోటీలను నిర్వహించారు. ఈమేరకు పోటీలను ప్రారంభించి సెక్రటరీ బాబులాల్ మాట్లాడారు. జిల్లాలో వివిధ కేటగిరిల్లో తైక్వాండో పోటీలను నిర్వహిస్తున్నామని వివరించారు. పోటీల్లో పాల్గొని గెలుపొందిన వారికి బహుమతులు, సర్టిఫికెట్‌లు అందజేశారు. కార్యక్రమంలో పీడీ శ్రీనివాసులు, ఆజమ్, ప్రేమ్, గోపీ రేవంత్ తదితరులు పాల్గొన్నారు.

‘గోరింటాకు మన సంస్కృతిలో భాగం’



గోరింటాకు పెట్టుకున్న మహిళలు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): గోరింటాకు పెట్టుకోవడం మన సంస్కృతిలో భాగమని వీరశైవ లింగాయత్, లింగ బలిజ సంఘం మహిళా కమిటీ అధ్యక్షురాలు నాగశ్రీ అన్నారు. మహిళలు ఆషాడ మాసంలో గోరింటాకు పెట్టుకోవడం చర్మ సంబంధ వ్యాధులు రాకుండా నివారిస్తుందని తెలిపారు. ఆషాడం పురస్కరించుకుని మహిళా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక వీరన్నపేట్‌లో గోరింటాకు మహోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీదేవి, సుజాత, రేణుకా, నీలమ్మ, అరుణ, వైశాలి, కరుణ, చంద్రకళ, గిరిజా పాల్గొన్నారు.

క్లుప్తంగా

పార్టీ బలోపేతానికి కృషి



స్టేషన్ మహబూబ్‌నగర్: సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లురవి జన్మదిన వేడుకలను ఆదివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. టీపీసీసీ ఉపాధ్యక్షులు ఒబేదుల్లా కొత్వాల్ నాయకులతో కలిసి కేక్‌కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో పిలిస్తే పలికే నాయకుడిగా మల్లురవికి ప్రజల్లో ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. పార్టీ బలోపేతం కోసం ఎంతో పాటుపడుతున్నారని అన్నారు. ఆయన భవిష్యత్తులో మరెన్నో పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధి జహీర్ అఖ్తర్, డీసీసీ మీడియాసెల్ కన్వీనర్ సీజే బెనహర్, నాయకులు బెక్కరి అనిత, లింగంనాయక్, అజ్మత్‌అలీ, అవేజ్ అహ్మద్, నాగరాజు, ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.

నవాబుపేట: నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవి జన్మదిన వేడుకలు మండలంలో నిర్వహించారు. అనంతరం హైదరాబాద్‌లో నివాసంలో మల్లురవిని కలిసి ఘనంగా సన్మానించారు. జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బంగ్లారవి, మండల అధ్యక్షుడు రాంచంద్రయ్య, ఖాజా, రాజేష్, మల్లేష్‌యాదవ్, అజహర్, షబ్బీర్, తిరుపతయ్యా, ఖాజామైనోద్దీన్, ఆంజనేయులు, రమేష్, శివరాములు, శ్రీహరి, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



జడ్చర్ల: పట్టణంలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. బాదేపల్లి బాలికల ఉన్నత పాఠశాలలో (1989–90లో 10వ తరగతి) చదివిన వారంతా మొట్టమొదటి సారిగా కలుసుకున్నారు. తమ చిన్ననాటి రోజులను నెమరు వేసుకున్నారు. తమకు చదువు చెప్పిన గురువులను ఆహ్వానించి సన్మానించారు. ఆటాపాటలతో ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో మాధవి, శాంత, సుజాత, భవానీ, కల్పలత, జ్యోతి, శ్రీదేవి, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

పొలంలోకి దూసుకెళ్లిన అంబులెన్స్

నారాయణపేట రూరల్: అదుపుతప్పి ఓ 108 అంబులెన్స్ వ్యవసాయ పొలంలోకి దూసుకెళ్లింది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాలిలా.. ధన్వాడకు చెందిన 108 అంబులెన్స్ ఓ డెలివరీ కేసులో జిల్లా ఆస్పత్రి వచ్చి తీసుకొచ్చి తిరిగి వెళ్తున్నారు. ఈ క్రమంలో అప్పక్‌పల్లి దాటిన తర్వాత మెడికల్ కళాశాల సమీపంలో ఎదురుగా వస్తున్న లారీని ఓవర్‌టేక్ చేయబోతుండగా...అంబులెన్స్ ఎడమవైపునకు మళ్లించారు. దీంతో అది కాస్తా అదుపుతప్పి వ్యవసాయ పొలంలోకి దూసుకెళ్లింది. కాగా సిబ్బందికి ఎలాంటి గాయాలు కాలేదు.



మూసాపేట బీసీ హాస్టల్‌కు రూ. కోటి

- నిర్మాణానికి నిధులు మంజూరు
- పూర్తయిన స్థల ఎంపిక
- పేద విద్యార్థులకు మేలు
- ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి



మూసాపేటలో ప్రస్తుతం అద్దె భవనంలో కొనసాగుతున్న బీసీ హాస్టల్

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలోని బీసీ హాస్టల్‌కు మహర్దశ పట్టనుంది. సుమారు 50 ఏళ్ల నుంచి అద్దె భవనాల్లో కొనసాగుతున్న హాస్టల్‌కు సొంత భవనం నిర్మించడానికి ప్రభుత్వం సంసిద్ధత వ్యక్తం చేసింది. అద్దె భవనాల్లో కొనసాగుతున్న హాస్టల్‌లో విద్యార్థులు ఏటా ఇబ్బందులకు గురవుతున్నారు. ఈనేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి సర్కారు నిర్ణయం నిరుపేద బీసీ విద్యార్థులకు ఊరట కలిగించనుందని నాయకులు, స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఆది నుంచి అద్దె భవనాల్లోనే..!

మూసాపేట మండల కేంద్రంలో చాలా ఏళ్ల కిందట ఎస్సీ, బీసీ బాలుర హాస్టళ్లను ఏర్పాటు చేశారు. మొదట రెండు హాస్టళ్లను అద్దె భవనాల్లోనే ఏర్పాటు చేశారు. తర్వాత బీసీకాలనీ సమీపంలో ఎస్సీ హాస్టల్‌కు సొంత భవనం నిర్మించారు. అక్కడ విద్యార్థులకు కావల్సిన అన్ని సౌకర్యాలను కల్పించారు. ఇక బీసీ హాస్టల్ మాత్రం మొదటి నుంచి అద్దె భవనాల్లోనే కొనసాగుతోంది. ప్రస్తుతం 80 మంది వరకు విద్యార్థులు ఉన్నారు. ఇప్పుడు కూడా బీసీ హాస్టల్ అద్దె భవనంలో కొనసాగుతోంది.

రూ.కోటి మంజూరు చేసిన సీఎం

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈనెల 9న జిల్లాకు వచ్చిన సందర్భంలో నియోజకవర్గాల వారీగా సమీక్ష చేశారు. ఈ సమయంలో మూసాపేటలో బీసీ హాస్టల్‌కు సొంత భవనం లేక విద్యార్థులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని దేవరకద్ర శాసనసభ్యుడు జి.మధుసూదన్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఉన్నతాధికారులతో వివరాలు సేకరించిన సీఎం బీసీ హాస్టల్‌కు సొంత భవనం నిర్మించడానికి రూ.కోటి మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఈనేపథ్యంలో హాస్టల్ నిర్మాణం కోసం గ్రామానికి సమీపంలో రెవెన్యూ అధికారులు స్థలాన్ని కూడా ఎంపిక చేశారు. ఉన్నతాధికారులు టెండర్ల ప్రక్రియను చేపట్టాల్సి ఉంది.

20 ఏళ్ల కిందట నిధులొచ్చినా..!

బీసీ హాస్టల్ సొంత భవనం కోసం ఉమ్మడి రాష్ట్రంలో 20 ఏళ్ల కిందట కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పులి వీరన్న ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో సుమారు రూ.11లక్షలను భవన నిర్మాణం కోసం అప్పటి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. హాస్టల్ కోసం పిల్లిగుండ్ల వద్ద స్థలాన్ని ఎంపిక చేయగా అప్పటి ఎమ్మెల్యే పులివీరన్న భవన నిర్మాణానికి శంకుస్థాపన కూడా చేశారు. తర్వాత అక్కడ స్థల వివాదం ఏర్పడటంతో హాస్టల్ నిర్మాణం అటకెక్కింది. తర్వాత వచ్చిన నిధులు వెనక్కి పోవడంతో హాస్టల్ నిర్మాణం కథ కంచికి చేరింది. తాజాగా ఇప్పటి ప్రభుత్వం హాస్టల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంతో విద్యార్థులు, విద్యాభిమానుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

విద్యాభివృద్ధికి పెద్దపీట



కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో విద్యా, వైద్యానికి పెద్దపీట వేస్తున్నాం. నిరుపేద పిల్లలకు మెరుగైన విద్య అందించడానికి కృషి చేస్తున్నాం. మూసాపేట బీసీ హాస్టల్‌కు సీఎం రేవంత్‌రెడ్డి రూ.కోటి మంజూరు చేశారు. దీనికి సంబంధించిన స్థల ఎంపిక పూర్తయింది. టెండర్లు ఖరారు కాగానే పనులు మొదలు పెట్టిస్తాం.

–జి.మధుసూదన్‌రెడ్డి, ఎమ్మెల్యే. దేవరకద్ర

ఇన్‌చార్జ్ అసిస్టెంట్ ప్లీడర్‌గా కురుమయ్య

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లాకేంద్రంలోని సీనియర్ సివిల్ జడ్జీ కోర్టు ఇన్‌చార్జ్ అసిస్టెంట్ ప్లీడర్‌గా కొత్తగంజ్‌కు చెందిన సీనియర్ న్యాయవాది కురుమయ్య నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ విజయేందిర ఉత్తర్వులు జారీ చేశారు. ఈయనతో పాటు బండమీదిపల్లికి చెందిన జి. శ్రీనివాసులు గౌడ్ నియమితులయ్యారు. వీరు 6 నెలల పాటు ఈ పదవిలో కొనసాగనున్నారు.

క్రీడా మైదానం చదునుకు చేయూత



మొరం వేయిస్తున్న యువకులు

జడ్చర్ల టౌన్: మండలంలోని గంగాపురం జెడ్పీహైస్కూల్ క్రీడా మైదానం చదును చేయించడం కోసం గ్రామ యువత చేయూతనందించారు. ఈ మేరకు ప్రాంగణానికి కావాల్సిన మొరం మట్టిని టిప్పర్ల సాయంతో ఆదివారం వేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు క్రీడాపరికరాలను సైతం అందజేస్తామని వివరించారు. యువకులను హెచ్‌ఎం అనంతప్ప అభినందించారు. మైలారం శివారెడ్డి, కేశవ్, గౌరిశంకర్, నరేష్‌చారి, చంద్రప్రకాష్, శివ, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నదర్పల్లిలో బోనాల పండుగ



బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

హన్వాడ: మండల పరిధిలోని చిన్నదర్పల్లిలో ఆదివారం బోనాల పండుగను ప్రజలు ఘనంగా నిర్వహించారు. గ్రామ శివారులోని పోచమ్మ ఆలయానికి ఊరేగింపుగా వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారికి నైవేద్యాలు, బోనాలు సమర్పించారు. బోనాల వేడుకతో గ్రామం మొత్తం సందడిగా మారింది. గ్రామపెద్దలు, నాయకులు, యువత పెద్దఎత్తున పాల్గొన్నారు.

ఘనంగా కట్ట మైసమ్మ ఉత్సవాలు



మైసమ్మ వేడుకల్లో పాల్గొన్న గ్రామస్తులు

దేవరకద్ర: మండల కేంద్రంలోని పెద్ద చెరువు వద్ద ఉన్న కట్ట మైసమ్మ ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. పోచమ్మ బోనాలకు ముందుగా కట్ట మైసమ్మకు బోనం ఎత్తడం మండలకేంద్రంలో ఆనవాయితీగా వస్తోంది. పట్టణంలోని తెలుగువాడ నుంచి పెద్దబోనం ఎత్తుకుని పెద్ద చెరువు వరకు ఊరేగింపు నిర్వహించారు. ఉత్సవాల్లో తెలుగువాడ, కుర్వవాడ, దళితవాడల నుంచి పలువురు పెద్దలు పాల్గొన్నారు. కట్టమైసమ్మకు ప్రత్యేకంగా పూజలు నిర్వహించి నైవేద్యాలను సమర్పించారు. ఈ నెల 19న శుక్రవారం తాయమ్మ బోనాల పండుగను నిర్వహించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా 23న మంగళవారం పోచమ్మ బోనాల వేడుక ఉంటుందని తెలిపారు.





అప్పంపల్లి బస్టాండ్ సమీపంలో గుంతల్లో నిలిచిన నీరు

చెరువులను తలపిస్తున్న రోడ్లు

చిన్నచింతకుంట: అప్పంపల్లి బస్టాండ్ సమీపంలో దేవరకద్ర, ఆత్మకూర్ వెళ్లే దారిలో బీటీ రోడ్డు గుంతలమయంగా మారింది. దీంతో ఆదివారం కురిసిన వర్షానికి నీరు నిలిచి చెరువును తలపిస్తోంది. నీరు నిల్వ ఉండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. గత రెండు మూడు సంవత్సరాల నుంచి వర్షం నీరు గుంతల్లో నిలిచినప్పుడు పంచాయతీ సిబ్బంది మోటార్ పంపు ఏర్పాటు చేసి బయటికి తోడేస్తున్నారని.. కానీ శాశ్వత పరిష్కారం చూపడం లేదని ప్రజలు వాపోతున్నారు. రాత్రి సమయంలో వాహనదారులు గుంతలను గుర్తించలేక గాయాల పాలవుతున్నారని వాపోతున్నారు. ప్రజా ప్రతినిధులు అధికారులు పట్టించుకుని సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

ఫతేపూర్‌లో జనజాతర





నవాబుపేట: మండల పరిధిలోని పర్వతాపూర్ మైసమ్మ దేవత చెంత ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. అమ్మవారి నామస్మరణతో అడవి మొత్తం మార్మోగింది. భక్తులు తండోపతండాలుగా వచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. నైవేద్యాలు సమర్పించారు. వాహనాలకు పూజలు చేయించారు. సెలవు రోజు కావటంతో అడవిలో చెట్ల కింద సేదాతీరారు.

ధ్యానంతో మానసిక ఆరోగ్యం



నారాయణపేట రూరల్: నిత్యం ధ్యానం చేయడంతో మానసిక ప్రశాంతత లభించి ఆరోగ్యకరంగా తయారవుతారని శ్రీరామచంద్ర మిషన్ జిల్లా కో –ఆర్డినేటర్ గద్దె ఆంజనేయులు అన్నారు. జిల్లా కేంద్రంలోని పతాంజలి యోగా సమితి ఆవరణలో శ్రీసాయి ఆస్పత్రి వైద్యులు డాక్టర్ గందెకార్తిక్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత ధ్యాన (మెడిటేషన్) శిబిరాన్ని ఏర్పాటు చేశారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఆంజనేయులు ధ్యానం చేయడంతో కలిగే ఉపయోగాలు, చేసే విధానం వివరించారు. అన్ని వయసుల వారు ప్రతిరోజు గంటపాటు ధ్యానం చేయాలన్నారు. ఆరోగ్యంతోపాటు వివేకం, విజ్ఞానం పెంపొందుతాయన్నారు. అదేవిధంగా ఈ నెల 21న ప్రత్యేక శిబిరం ఉంటుందన్నారు. జిల్లా, చుట్టు పక్కల గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గందె ఉమాకాంత్, సురేష్, శిరీష, రాజేందర్, యశ్వంత్, రఘు, సంజీవ్ పాల్గొన్నారు.

కరపత్రం విడుదల



నారాయణపేట రూరల్: ఆషాడ శుద్ధ పూర్ణిమ రోజు నిర్వహించే మాతా మాణికేశ్వరి అమ్మవారి జయంతి వేడుకలను విజయవంతం చేద్దామని సూర్యనందిక్షేత్రం కార్యదర్శి శివయ్యస్వామి తెలిపారు. పట్టణంలోని చౌక్‌బజార్‌లో అమ్మవారి భక్తులతో కలిసి ఆదివారం వేడుకల కరపత్రం విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 21న గురుపౌర్ణమి రోజు ఉదయం 9గంటలకు యానగుంది క్షేత్రంలో మహారుద్రాభిషేకం, పాదపూజ సాయంత్రం 7గంటలకు రథోత్సవం నిర్వహిస్తామన్నారు. అదేవిధంగా పట్టణ శివారులోని పగిడిమర్రి రోడ్డులోని వ్యాసాశ్రమంలో ప్రత్యేక పూజలు, పాదపూజ, డోలారోహణ వేడుకలు జరుగుతాయని తెలిపారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరై అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.